

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



డీఈవో కార్యాలయంలో టెన్త్ ఫలితాలు వెల్లడిస్తున్న డీఈవో వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరరావు



ప్రైవేట్ ప్రతిభ

ఎస్.మోహిత్ (596), చిత్తూరు
ఎస్.పల్లవి (596), చిత్తూరు
నిరంత్‌సాయి (591), పలమనేరు

బీసీ వెల్ఫేర్ పాఠశాలల ముందంజ

జిల్లాలో 98.55 శాతం ఉత్తీర్ణతతో బీసీ వెల్ఫేర్ పాఠశాలలు ముందంజలో ఉండగా, 47.31 శాతం ఉత్తీర్ణతతో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు చివరి స్థానంలో నిలిచాయి. 95.06 శాతం ఉత్తీర్ణతతో గుడిపాల మండలం మొదటి స్థానంలో నిలవగా, 35.83 శాతం ఉత్తీర్ణతతో ఎస్ఆర్‌పురం మండలం చివరి స్థానంలో నిలిచింది.



టెన్త్ ఫలితాల్లోనూ వెనుకబాటే!

ఆరవ స్థానం నుంచి 24వ స్థానానికి పతనం ● ఉత్తీర్ణత శాతం 67.06

● మేనేజ్‌మెంట్ల వారీగా ఫలితాలు

మేనేజ్‌మెంట్	విద్యార్థులు	పాస్	ఫెయిల్	శాతం
బీసీ వెల్ఫేర్	138	136	68	98.55
ఏపీ రెసిడెన్షియల్	109	97	12	88.99
ప్రైవేటు పాఠశాలలు	4987	4332	470	86.87
సోషియల్ వెల్ఫేర్	476	405	71	85.08
ఏపీ మోడల్ స్కూల్	497	349	57	70.22
కేజీబీవీ	295	206	89	69.83
ఎయిడెడ్	191	123	68	64.40
జిల్లా పరిషత్	11,974	7139	4835	59.62
మున్సిపల్	807	477	146	59.11
ప్రభుత్వ	1229	638	591	51.91
ట్రైబల్ వెల్ఫేర్	93	44	49	47.31
మొత్తం	20,796	13,946	6850	67.06

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల తీరులోనే బుధవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లోనూ జిల్లా పూర్తిగా వెనుకబడిపోయింది.67.06 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. గతేడాది ఆరవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.జిల్లాస్థాయి టెన్త్ ఫలితాలను డీఈవో వరలక్ష్మి, పరీక్షల విభాగం సహాయ కమిషనర్, ఏడీ వెంకటేశ్వరావు డీఈవో కార్యాలయంలో విడుదల చేశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో స్థానిక నారాయణ స్కూల్‌కు చెందిన ఎస్.మోహిత్, ఏవీఆర్ స్కూల్‌కు చెందిన ఎస్.పల్లవి 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలైన ప్రభుత్వ,జడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్, హైస్కూల్ ప్లస్, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడ్డారు.

● జిల్లాలో 20,796 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 13,946 మంది (67.06 శాతం) ఉత్తీర్ణులు కాగా 6850 మంది ఫెయిలయ్యారు. 10,073 మంది బాలికలకు గాను 7373 మంది (73.20శాతం) ఉత్తీర్ణులు కాగా, 2700 మంది ఫెయిలయ్యారు. 10723 మంది బాలురకు గాను 6573మంది (61.30శాతం) పాస్ కాగా 4150 మంది ఫెయిలయ్యారు. జిల్లావ్యాప్తంగా 10,096 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాసులో పాస్‌కాగా, 2562 మంది సెకండ్ క్లాసులో, 1288 మంది విద్యార్థులు థర్డ్‌క్లాసులో ఉత్తీర్ణులయ్యారు.

బోధన లోపమే కారణమా?

బోధనలోపం కారణంగానే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.పరీక్షల సమయంలో వంద రోజుల ప్రణాళికను సజావుగా అమలు చేయకపోవడం, విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టుల్లో ప్రత్యేక బోధన చేయడంలోనూ ఉపాధ్యాయులు విఫలమయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరో వైపు సిలబస్ కొత్త కావడం, తొలి సారిగా కొత్త పరీక్షల విధానం అమలు చేయడం , దీనిపై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించకపోవడం ఫలితాలపై ప్రభావం చూపాయి. వీటికి తోడు గతంలో ఒక్కో సబ్జెక్టుకు రెండు పేపర్లు (రెండు రోజులు) ఉండగా, తాజాగా కేవలం వంద మార్కుల పేపర్ ఒక్క రోజే రాయాల్సి ఉండడంతో విద్యార్థులపై ఒత్తిడి భారం ఉండటం కూడా మరో కారణంగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ



ఏపీ హేమ (592), జడ్పీ ఉన్నత పాఠశాల, మంగళపల్లి, బంగారుపాళ్యం మండలం, ఎం.అలేఖ్య (592), జడ్పీ హైస్కూల్ ప్లస్, విజయపురం, బి.భావన (588) జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పలమనేరు, ఎన్.దినీషా (586) జడ్పీహెచ్ఎస్, పి.కొత్తకోట, పూతలపట్టు మండలం

● మూడేళ్లుగా ఫలితాలు ఇలా....

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం	రాష్ట్రంలో స్థానం
2023	69.53	17
2024	91.28	6
2025	67.06	24

● ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 20వ స్థానం

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ చిత్తూరు జిల్లా 20వ స్థానంలో నిలిచింది. టెన్త్ పరీక్షలను 864మంది విద్యార్థులు రాయగా, కేవలం 77 మంది (8.91శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బాలురు 506 మందికి 61 మంది మాత్రమే పాస్ కాగా, 358 మంది బాలికలకు గాను కేవలం 16మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్‌లో 3008 మందికి గాను 603 మంది (20.05) పాసయ్యారు. 2005 మంది బాలురకు 360 మంది పాస్ కాగా, 1003 మంది బాలికలకు గాను 243 మంది ఉత్తీర్ణులయ్యారు.

● 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. గురువారం నుంచి ఈనెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంది. రూ.50 అపరాధ రుసుముతో మే నెల ఒకటి నుంచి 18వ తేదీ వరకు ఫీజు చెల్లించే వెసులుబాటు ఇచ్చారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500 కాగా, రీ వెరిఫికేషన్ ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి మొత్తాన్ని మే ఒకటవ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చు.

ఉగ్రమూకల దాడిపై నిరసన



చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీగా వస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కులం, మతం పేరు అడిగి మరీ పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం దారుణమన్నారు. ప్రకృతిని ఆస్వాదించడానికి వెళ్లిన యాత్రికులపై కాల్పులు జరిపి 25 మంది మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో నేతలు చిట్టిబాబు, అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.అలాగే వైసీపీ ఆధ్వర్యంలోనూ ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లో భారతీయులను దారుణంగా కాల్చి చంపిన వారిని వెంటను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, పార్టీ నాయకులు విజయానందరెడ్డి, శేఖర్, హరిణిరెడ్డి, గాయత్రీదేవి, భారతి తదితరులు పాల్గొన్నారు.

డీసెట్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో డీసెట్-2025 సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ శేఖర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి మే 8వ తేది వరకు www.cse.ap.gov.in, www.apdeecet. apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.

కొత్త కలెక్టరేట్‌లోకి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని కొత్త కలెక్టరేట్‌లోని జ్యోతిరావు పూలే భవనంలోకి మార్చినట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ రాఘవులు తెలిపారు.గిరింపేటలోని గీతామందిరం ఎదురుగా అద్దె భవనంలో ఉండే కార్యాలయాన్ని బుధవారం మార్చినట్లు తెలిపారు. మాజీ సైనికులు, వితంతువులు, వారి కుటుంబ సభ్యులు ఈ మార్పును గమనించాలని కోరారు.




చిత్తూరులో బోసిపోయిన పాతబస్టాండు సర్కిల్

మార్నింగ్ నుంచే మాడుతోంది

● 42 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు
● మంట పుట్టిస్తున్న వేడిగాలులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో జిల్లావాసులు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే పలుచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేడిగాలుల కారణంగా చిత్తూరు నగరంలోని పలు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇతర రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గింది. బుధవారం అత్యధికంగా తవణంపల్లెలో 42.1, శ్రీరంగరాజపురంలో 41.1, నగరిలో 40.2, అత్యల్పంగా పలమనేరులో 34.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.చిత్తూరు, గుడిపాల మండలాల్లో 39.9డిగ్రీలు, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 39, గంగాధరనెల్లూరులో 38.9, సదుం, సోమల మండలాల్లో 38.8, బంగారుపాళ్యంలో 38.7, చౌడేపల్లె, ఐరాల, నింద్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 38.2, రొంపిచెర్లలో 38, గంగవరం, గుడుపల్లె, కుప్పం, పెద్దపంజాణి, శాంతిపురం మండలాల్లో 37.8, యాదమరిలో 37.7, కార్వేటినగరంలో 37, బైరెడ్డిపల్లెలో 36.2, వి.కోటలో 35.7, పుంగనూరు, రామకుప్పం మండలాల్లో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శాస్త్రసాంకేతికత ఎక్కడున్నా వొడిసిపట్టి పాలనలో చొప్పించే ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టనున్నారు. ఏఐ కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థకు ఆధునిక సాంకేతికతను జోడించే ప్రణాళిక సిద్ధమవుతోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా కుప్పంలో అమలు చేయబోతున్న ఈ ప్రాజెక్ట్ అమలుకోసం కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)కి ఇప్పటికే రూ.2 కోట్లు కేటాయించారు.



ఏఐ సీసీ కెమెరా

కుప్పంలో స్మార్ట్ పోలీసింగ్!

● ఏఐ సీసీ కెమెరాలతో నేర నియంత్రణకు ప్రణాళిక
● పైలట్ ప్రాజెక్ట్ అమలుకు కసరత్తు ● 140 కెమెరాల కోసం ప్రతిపాదన
● రూ.2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్

కుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఇటీవల చోరీలు ఎక్కువయ్యాయి. పట్టపగలే దొంగతనాలు జరుగుతున్నాయి. ఆరేడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనికిరాకుండా పోవడంతో నేరస్తులను, నేరాలను గుర్తించడం కూడా పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది. ఇటీవల వరుసగా జరిగిన చోరీల్లో నేర పరిశోధన అందుకే నత్తనడకన సాగుతోంది. ఒక దశలో సాధారణమైన సీసీ కెమెరాలను తిరిగి కొత్తవి ఏర్పాటు చేయడానికి డిపార్టుమెంట్ తరఫున ప్రయత్నం జరిగింది. స్థానిక పోలీసు అధికారులు కొందరు దాతలను కూడా ఆశ్రయించారు. అయితే వారినుంచి స్పందన లభించకపోవడంతో అడుగులు ముందుకు పడలేదు. నేర శోధనలో పొరుగు రాష్ట్రాలలో పర్యటిస్తున్న సమయంలో అక్కడున్న స్మార్ట్ పోలీసింగ్ వ్యవస్థ పోలీసు అధికారులను ఆకర్షించింది. కర్ణాటక రాష్ట్రం తుముకూరులోని అత్యాధునికమైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ వ్యవస్థ ద్వారా కుప్పంలో జరిగిన చోరీకి బాధ్యుడైన ఒక నేరస్తుడిని గుర్తించగలిగారు కూడా. ఆ చోరీ ఇంకా పూర్తిస్థాయిలో డిటెక్ట్ కాకున్నా సరే, అక్కడి అత్యాధునిక నిఘా వ్యవస్థకు స్థానిక పోలీసులు ప్రభావితం అయ్యారు. ఈలోగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కుప్పంలో స్మార్ట్ పోలీసింగ్ భావన తెరమీదకు వచ్చింది. ఆయన కుప్పం నియోజకవర్గ అభివృద్ధికోసం కడాకు అనేక కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు రూ.2 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది.

పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు

పోలీసు వ్యవస్థలో నేర నియంత్రణకు ఏఐ కెమెరాల ఏర్పాటు అనేది కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఓ ప్రైవేటు ఏజన్సీ ప్రతినిధులు సుమారు రెండు నెలల క్రితం కుప్పం వచ్చి, ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయడానికి అనువైన ప్రదేశాలను గుర్తించారు. ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య వారితో పాటు పట్టణమంతా తిరిగి ఆయా ప్రదేశాలను ఎంపిక చేశారు.కుప్పం పట్టణంలో కీలకమైన కూడళ్లు, పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేయడానికి 140 ఏఐ సీసీ కెమెరాలు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. మరోవైపు కడా కార్యాలయం పై భాగాన అతి త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు కానుంది. పట్టణంలో ఏర్పాటు చేయబోయే ఏఐ సీసీ కెమెరాలను దీనికి అనుసంధానం చేస్తారు. ఇక్కడినుంచి స్మార్ట్ పోలీసింగ్ కొనసాగి నేరాల నియంత్రణ సులభసాధ్యమవుతుంది.

ఏఐ కెమెరాలతో స్మార్ట్ పోలీసింగ్ ఇలా

సాధారణ సీసీ కెమెరాలతో పోలిస్తే ఈ సీసీ కెమెరాలు వస్తువులను, మనుషులను, దృశ్యాలను గుర్తించి అర్థం చేసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగిస్తాయి. వస్తువులు, మనుషుల ముఖాలను గుర్తించడం, వాటి ప్రవర్తన, కదలికలను విశ్లేషించడం ద్వారా కచ్చితమైన , సమర్థవంతమైన నిఘా వ్యవస్థను అందిస్తాయి. ఏఐ కెమెరాలు తాము మెమరీలో భద్రపరిచిన గుర్తింపు ద్వారా రిపోర్టులను రూపొందించి, అవసరమైనప్పుడు హెచ్చరికలు జారీ చేస్తాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి నిర్దిష్ట ప్రాంతాలనికి వెళ్తే లేదా వాహనం కదిలిస్తే హెచ్చరికలు పంపవచ్చు. ఈ విధానం వినియోగించి ఒక ప్రాంతంలో నేరం చేసిన వ్యక్తి దేశంలో ఏ ప్రాంతంలో తిరుగాడుతున్నా, గుర్తించి అరెస్టు చేయడం పోలీసులకు సులభసాధ్యమవుతుంది.

140 సీసీ కెమెరాలకు ప్రతిపాదనలు



కుప్పం పట్టణంలో 140 ఏఐ సీసీ కెమెరాల ఏర్పాటుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఇప్పటికే సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు కుప్పం పట్టణంలో పర్యటించి వెళ్లారు. ఏఐ సీసీ కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థ మరింత పటిష్ఠమై, నేర నియంత్రణ సులభసాధ్యమవుతుంది.

\- శంకరయ్య,కుప్పం అర్బన్ సీఐ



తిరుమలలో ప్రారంభమైన భాష్యకారుల ఉత్సవాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 19 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మే 2న భాష్యకార్ల సాత్తుమొర ఉంటుంది. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీరామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా జీయంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద, చిన్న జీయర్ స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల ఘాట్‌లో పల్టీకొట్టిన సుమో

● ఏడుగురికి గాయాలు



తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం సుమో బోల్తాపడి ఏడుగురు భక్తులు గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని బుధవారం ఉదయం వాహనంలో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 35వ మలుపు వద్ద సుమో అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను తిరుపతిలో రుయాస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.61 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,828

తలనీలాలు సమర్పించినవారు: 21,165

సివిల్స్‌లో సాయి 'తేజ'స్సు

● కోచింగ్ లేకుండానే 154వ ర్యాంకు సాధన



నాయుడుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాధించిన దానితో ఆ యువకుడు సంతృప్తి చెందలేదు. అనుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమించాడు. నిన్నటి సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకుతో మెరిశాడు. నాయుడుపేట మండలం చిలమత్తూరుకు చెందిన నెల్లూరు సాయితేజ. ఈయన తండ్రి శ్రీనివాసులు చిల్లకూరు మండలం గమళ్ళదిబ్బలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి సరస్వతి ఓజిలిలో హెల్త్ సూపర్‌వైజరుగా పనిచేస్తున్నారు. వీరు 20 ఏళ్ళ కిందట చిల్లకూరులో స్థిరపడ్డారు.

పట్టువదలని విక్రమార్కుడిలా..

సాయితేజ 1నుంచి 5వ తరగతి వరకు నాయుడుపేట మండలం గొట్టిప్రోలు ఎలిమెంటరీ పాఠశాలలో చదివారు. 6 నుంచి 10 వరకు చిల్లకూరు లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య(విజయవాడ)లో చదివారు. హైదరాబాదులో బీటెక్ చదివారు. సివిల్ సర్వీసెస్‌కు మంచి ర్యాంకుతో ఎంపిక కావాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇందుకోసం కష్టపడి ప్రిపేర్ అయ్యారు. కష్టం ఫలించి గతేడాది 558వ ర్యాంకు పొందారు. అయినప్పటికీ సాయితేజ సంతృప్తి చెందలేదు. పట్టుదల వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాన్ని కొనసాగించారు. ఫలితంగా తాజాగా ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 154వ ర్యాంకు పొందారు. ఈయన భార్య జ్యోతిర్మయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. తమ్ముడు నెల్లూరు విష్ణుతేజ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. సాయితేజకు సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు వచ్చిందని తెలియగానే చిలమత్తూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

ఎలాంటి కోచింగూ పొందలేదు

సివిల్ సర్వీసెస్ కోసం ఎలాంటి కోచింగ్ ప్రత్యేకించి తీసుకోలేదు. అంతా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్‌తో ప్రిపేర్ అయ్యాను. ఐఏఎస్‌కి ఎంపిక కావాలనేది నా లక్ష్యం. అందుకే గతేడాది సివిల్స్‌లో 558వ ర్యాంకు వచ్చినా మళ్లీ రాశాను. ఈసారి 154వ ర్యాంకు వచ్చింది. అమ్మానాన్న, కుటుంబ సభ్యులు ఈవిషయంలో బాగా ప్రోత్సహించారు.

- నెల్లూరు సాయితేజ, సివిల్స్ 154వ ర్యాంకర్



భార్య, తల్లిదండ్రులతో సాయితేజ

అనుకున్నది సాధించాడు

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: 'మా అబ్బాయి సాయితేజకు ఐఏఎస్ కావాలన్నది లక్ష్యం. గతేడాది 558వ ర్యాంకుతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. ఐఏఎస్ కావాలన్న పట్టుదలతో ఈసారి 154వ ర్యాంకుతో అనుకున్నది సాధించాడు' అని సాయితేజ తల్లిదండ్రులు నెల్లూరు శ్రీనివాసులు, సరస్వతి బుధవారం ఆనందం వ్యక్తంచేశారు. తమ కుమారుడు కొన్నేళ్లుగా బీహెచ్ఈఎల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాడన్నారు. ఐఏఎస్‌గా పేదలకు న్యాయం చేయడమే అతడి ఉద్దేశ్యమని చెప్పారు.

రైల్లో చోరీ చేసి పారిపోతూ... గ్రామస్తులకు పట్టుబడ్డ నంద్యాలవాసి

● పోలీసులకు అప్పగించిన చెంగారెడ్డిపల్లెవాసులు



రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన దొంగ

రేణిగుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైల్లో దొంగతనం చేసి గ్రామస్తులకు పట్టుబడిన నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం ఉదయం 2 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లెలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి గూడూరు నుంచి తిరుపతికి వెళ్తున్న రైలులో బ్యాగును ప్రయాణికుడు చోరీ చేశాడు. బ్యాగుతో రేణిగుంట రైల్వేస్టేషన్ ఔటర్‌లో దిగి పారిపోయే క్రమంలో చెంగారెడ్డిపల్లెలోకి చేరుకున్నాడు. వీధి కుక్కలు పెద్ద ఎత్తున మొరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా మేల్కొన్నారు. దీంతో నిందితుడు ముళ్లపొదల్లో దాక్కున్నాడు. గ్రామస్తులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని ఆధార్ కార్డు ద్వారా నంద్యాలకు చెందిన హరీష్‌గా గుర్తించారు. చోరీ చేసిన బ్యాగ్‌ను పరిశీలించగా బంగారు నగలు ఉన్నట్టు గుర్తించారు. అయితే అవి రోల్డ్ గోల్డ్ అని తెలుసుకున్నారు. బంగారు నగలు అనుకుని ఆ బ్యాగ్‌ను చోరీ చేసి ఉంటాడని భావించారు. నెం.100కు ఫోన్ చేసి నిందితుడిని అర్బన్ పోలీసులకు అప్పగించారు. చోరీ జరిగింది రైలులో కావడంతో రైల్వే జీఆర్పీ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ రవి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'ఎంఎస్ఎంఈ' పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

● ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం
● ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో మంత్రి శ్రీనివాస్



కలెక్టరేట్‌లో అధికారులు, పరిశ్రమలతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు రాబోతున్నాయని, వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులతో అటు పారిశ్రామికాభివృద్ధి, ఇటు నిరుద్యోగ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చిత్తూరు ఉమ్మడి జిల్లా అధికారులతో పాటు ఎఫ్ఎస్ఎంఈ, ఫ్యాప్సియో, ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్, టెక్స్‌టైల్ నగరి అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఎంఎస్ఎంఈలో వృద్ధి సాధిస్తున్నామని వారి కోసం బెస్ట్ పాలసీ తీసుకొస్తామన్నారు. ఔత్సాహికులకు చేయూతనిచ్చి, ఉత్పత్తులను పెంచే దిశగా ఊతమివ్వడం ఉద్యోగ ఉపాధి అవకాశాలు మార్కెటింగ్ సదుపాయాల పెంపు కోసం కృషి చేస్తుందన్నారు. తిరుపతి, చిత్తూరులో పరిశ్రమల అభివృద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకువచ్చి సింగిల్‌విండో పద్ధతిన అన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం సూచించిన ప్రణాళికల ఆధారంగా కృషి చేస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల వారు తీసుకునే రుణాలను జీవనోపాధి వైపు మళ్లించి వ్యాపారవేత్తలుగా తయారుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్నారు. అంతకుముందు పరిశ్రమల అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు ఎంఎస్ఎంఈ, ఉమ్మడి జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఆక్సిజన్ పరిశ్రమకు భూమిపూజ

పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి సమావేశం



వరదయ్యపాళెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో ఎంఎస్ఎంఈ కేటగిరికి చెందిన 'గుప్తా ఆక్సిజన్ ప్రైవేటు లిమిటెడ్‌'కు బుధవారం రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భూమిపూజ చేశారు. రూ.40కోట్లతో నిర్మిస్తున్న ఈ పరిశ్రమ 2025 అక్టోబరు నాటికి ఉత్పత్తులు ప్రారంభించనుంది. డ్యూ గ్యాస్ పేరిట పారిశ్రామిక గ్యాస్‌ను ఇది ఉత్పత్తి చేస్తుంది. ఏపీ ఆటోమేటిక్ రంగాలకు గ్యాస్ సరఫరా చేయనుంది. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఆసంస్థ ఎండీ, సీఈవో ఆనంద గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీసిటీ పరిసరాల్లో పర్యటించారు. ఎవర్టన్ టీ పరిశ్రమను సందర్శించారు. 90శాతం పైగా స్థానిక గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ పరిశ్రమ, మహిళా సాధికారత, సమ్మిళిత వృద్ధికి చక్కని నమూనాగా కొనియాడారు. తన పర్యటనలో భాగంగా ఆయన శ్రీసిటీ పరిశ్రమల సీఈవోలతో సమావేశమయ్యారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషి చేస్తున్నట్లు ఆయన అభినందించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పీ4 విజన్ పయనం సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఏపీకే రెడ్డి, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు హాజరయ్యారు. వారితో పాటు ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలత్తూరులో 80 పరిశ్రమలకు భూముల కేటాయింపు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆంధ్రజ్యోతి: బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు ఏపీఐఐసీలో 80 పరిశ్రమలకు భూములు కేటాయించినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆలత్తూరులో ఏపీఐఐసీ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. భూముల రికార్డులను అధికారులు మంత్రికి వివరించారు.

జిల్లాలో ఐదుగురు సీఐల బదిలీ

● వీఆర్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్
● ఈస్ట్‌కు శ్రీనివాసులు నియామకం



సీఐ శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బదిలీ అయిన వారిలో తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న రామకృష్ణను సోషల్ మీడియా విభాగానికి నియమించారు. ఈస్ట్ సీఐగా పనిచేస్తున్న జగదీష్‌ను అనంతపురం పీటీసీకి.. జిల్లా ఎస్పీ వీఆర్‌లో ఉన్న మద్దయ్యాచ్చారిని తిరుమల స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుపతిలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్ బాషాను భాకరాపేటకు, వీఆర్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ఈస్ట్‌కు నియమించారు. వెస్ట్ పీఎస్‌లో అటాచ్‌మెంటులో సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌ను అక్కడే రెగ్యులర్ సీఐగా నియమించారు. వీరందరూ తక్షణం వారి వారి స్థానాల్లో బాధ్యతలు తీసుకోవాలని డీఐజీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుపతిలో బాలికపై అత్యాచారం

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ మేరకు బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి నగరానికి చెందిన 16 ఏళ్ల బాలికకు చెర్లోపల్లెకు చెందిన రవికుమార్‌తో పరిచయం వుంది. ఇతను ఫ్లోరింగ్ టైల్స్ పనులు చేస్తున్నాడు. ఇతని స్నేహితులు సింగాలకుంటకు చెందిన సాయికుమార్ ఫోటో ఫ్రేమ్ వర్కు చేస్తున్నాడు. ఈ నెల 17న ఆ బాలిక సాయికుమార్‌తో కలిసి వెళ్లింది. ఇంట్లో కనిపించకపోవడంతో తల్లితండ్రులు వెస్ట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, చెర్లోపల్లె వద్ద గది తీసుకున్న ముగ్గురు ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు బుధవారం బాధితులు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళీమోహన్ వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనలో సాయికుమార్ స్నేహితుడు ప్రకాశం జిల్లాకు చెందిన రవి సైతం పాల్గొన్నట్లు రుజువు కావడంతో అతడిపైనా కేసు నమోదు చేశారు.

శ్రీనివాస సముదాయంలో క్రీడా వేదికలు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో పలు క్రీడా వేదికలను రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పికిల్ బాల్, బాస్కెట్ బాల్, రైఫిల్ షూటింగ్ ఆడుతూ కాసేపు సరదాగా గడిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడుల్లో మృతిచెందిన పర్యాటకుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. దక్షిణాదిన ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. పేద క్రీడాకారులు ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనడానికి వీలుగా ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2నుంచి 3శాతానికి పెంచిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్మార్ట్‌సిటీ నిధులతో ఇందిరా మైదానంలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీన, ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభించామన్నారు. గొల్లవానిగుంటలో నిర్మాణ దశలో ఆగిపోయిన క్రికెట్ స్టేడియాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి చర్యలు ప్రారంభించామన్నారు. టీటీడీ కేటాయించిన రూ.కోటి నిధులతో సముదాయంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గుంటూరుకు చెందిన హాట్రిక్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొపయిటర్ అండ్ బ్రదర్స్ శ్రీరామ్ క్రీడాకారుల ప్రయోజనార్థం రూ.2 లక్షలతో క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, టీటీడీ బోర్డు సభ్యుడు పనబాకలక్ష్మి, మహిళా వర్సిటీ వీసీ ఉమ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, మహేష్‌యాదవ్, ఊకా విజయ్‌కుమార్, వరప్రసాద్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, దాతలు ప్రణీత్, వై.ప్రవీణ్, శ్రీధర్, క్రీడా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో రైఫిల్ షూటింగ్ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయకులు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ10లక్షల విరాళం



తిరుపతి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గుడివాడకు చెందిన ఎన్ఆర్ఐ చల్లగుల్ల సాయిరాజ తరఫున ఆయన తండ్రి ప్రసాద్ రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మికి ప్రసాద్ విరాళం మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పాల్గొన్నారు.

స్వల్పంగా ధర తగ్గిన బంగారం

● కాస్త పెరిగిన కొనుగోళ్లు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బంగారం ధరలు స్వల్పంగా తగ్గడంతో తిరుపతిలోని కొన్ని కార్పొరేట్ స్థాయి దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. అదే పెద్ద, చిన్న దుకాణాలు వెలవెలపోతున్నాయి. నిన్నటి వరకు 22 క్యారెట్ల బంగారం గ్రాము 10,200 వరకు పలికింది. అదే బుధవారం మధ్యాహ్నానికి గ్రాముపై రూ 300 తగ్గి రూ.9900 వరకు చేరింది. అదే 24 క్యారెట్ల బంగారం గ్రాము 10,250 నుంచి 9900కు వచ్చింది. దీంతో పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం పలువురు బంగారం కొనేందుకు ఆసక్తి చూపారు. తిరుపతి బాలాజీ కాలనీలోని కొన్ని బంగారు దుకాణాల వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొంత సందడిగా కనిపించింది. అదే బజారు వీధిలోని దుకాణాల వద్ద ఎవరూ లేరు. నగరంలో తిరుపతిలో చిన్నా చితక దుకాణాలు దాదాపు 550 వరకు వున్నాయి. అదే కార్పొరేట్ స్థాయి షాపులు దాదాపు 12 వరకు వున్నాయి. వీటిల్లో రోజుకు గతంలో అయితే రూ ఆరు కోట్లు నుంచి 8 కోట్లు వరకు వ్యాపారం జరిగేదని ప్రస్తుతం బంగారం ధరలు బాగా పెరగడంతో రోజుకు రూ.మూడు కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని దుకాణాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఇప్పుడు గ్రాము బంగారంపై రూ.300 మాత్రమే తగ్గింది. ఇది స్థిరంగా ఉండే అవకాశాల్లేవు. పరిస్థితులను బట్టి రానున్న ఆరు నెలల కాలంలో మరింత పెరిగే అవకాశాలున్నాయి' అని బంగారు దుకాణాల సంఘం అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ అన్నారు. కాగా, వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

ఉగ్రవాదుల దాడుల్లో మృతిచెందిన పర్యాటకులకు కొవ్వొత్తుల నివాళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకులకు బుధవారం తిరుపతిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కృష్ణాపురం ఠాణా నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అంతకుముందు ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో జనసేన పార్టీ జెండాను ఎమ్మెల్యే శ్రీనివాసులు అవనతం చేశారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుభాషిణి, బాబ్జి, రాజేష్ ఆచారి, దినేష్‌జైన్, బాలిశెట్టి కిషోర్, లక్ష్మీపతి, మునస్వామి, హేమంత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శిరీష, అక్బర్ పాల్గొన్నారు.

బియ్యం స్టాక్‌లేదు.. డబ్బులిస్తాం తీసుకోండి!

● ఎండీయూ ఆపరేటర్ల నిర్వాకం ● కార్డుదారులకు అందని బియ్యం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల బియ్యం స్టాక్ తక్కువగా వచ్చింది.. బియ్యానికి బదులుగా డబ్బులిస్తాం తీసుకోండి.. అంటూ ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు కార్డుదారులను కోరుతున్నారు. తమకు బియ్యమే కావాలని కార్డుదారులు చెప్పినా వినకుండా వేలిముద్ర వేసి చక్కెర, కందిపప్పు తీసుకుని వెళ్లిపోండని ఒత్తిడి చేస్తున్నారు. ఏప్రిల్ నెల పూర్తికావస్తున్నా సూళ్లూరుపేట పట్టణంలో నేటికీ పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం పంపిణీ జరగలేదు. రేషన్ షాపుల వద్దకు వెళితే... మాకు సంబంధం లేదు.. ఎండీయూ వాహనాలు వస్తాయి.. అక్కడే తీసుకోండి.. అంటూ ముప్పతిప్పలు పెడుతున్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో మొత్తం 121 చౌక దుకాణాల పరిధిలో 47,032 రేషన్ కార్డులున్నాయి. వీరికి నెలనెలా 680 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. మూడు మండలాల్లో జనవరిలో 60శాతం, ఫిబ్రవరిలో 60శాతం, మార్చిలో 70శాతం బియ్యం పంపిణీ జరిగినట్లు రికార్డుల్లో నమోదైంది. మిగిలిన స్టాక్ నిల్వ కింద చూపి తదుపరి నెలకు కేటాయింపులు జరుగుతాయి. ఏప్రిల్ నెలకు డీలర్ల వద్ద స్టాక్ నిల్వలు ఉన్నట్లు రికార్డులు చూపిస్తుండడంతో దాదాపు 30 టన్నుల కోత పడినట్లు అధికారులు చెబుతున్నారు. వచ్చిన బియ్యాన్ని కూడా సక్రమంగా అందించకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సూళ్లూరుపేటకు రెగ్యులర్ సీఎస్ డీటీ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చూస్తాం

ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే బియ్యం అందేలా చూస్తాం, త్వరలోనే డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చక్కదిద్దుతాం.

- తహసీల్దార్ నరసింహారావు

జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి అరుణసారికను బుధవారం ఎస్పీ మణికంఠ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఎస్పీ మొక్కను అందించారు.


జడ్జికి మొక్కను అందిస్తున్న ఎస్పీ మణికంఠ

నడిరోడ్డుపై నిలిచిపోయిన 108 వాహనం



పెనుమూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యపరంగా ఎవరికైనా అత్యవసరమైతే వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేస్తాం.. అలాంటిది ఆ అంబులెన్స్‌కే అత్యవసరమైతే ఎవరికి ఫోన్ చేయాలో తెలియలేదేమో డ్రైవర్‌కి మధ్యాహ్నం నుంచి నడిరోడ్డుపై నిలిచిపోయింది. పెనుమూరు తహసీల్దారు కార్యాలయం ముందు నడిరోడ్డుపై బ్రేక్ డౌన్ అయ్యి నిలిచిపోయి సాయంత్రం 8 వరకు అక్కడే ఉండిపోయింది. బుధవారం పెనుమూరు వారపు సంత కావడంతో వాహనాలతో రోడ్డు ట్రాఫిక్ జామ్ కావడంతో ఓ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం, మరో వైపు కనీసం పట్టించుకునేవారు లేకపోవడంతో అక్కడే ఉండిపోయింది. రాత్రి 8 గంటలు దాటాక సిబ్బంది రిపేరు చేసి అక్కడ నుంచి వాహనం తీశారు.

విద్యుత్ శాఖ నిర్మాణ విభాగ డీఈ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఆ శాఖ నిర్మాణ విభాగ డీఈ కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ప్రారంభించారు. గతంలో ఈ విభాగం తిరుపతిలో ఉండేదని, జిల్లాల విభజన తర్వాత ఎస్ఈ కార్యాలయం చిత్తూరుకు రావడంతో నిర్మాణ విభాగం కూడా జిల్లా కేంద్రానికి వచ్చిందని ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, గదీష్, నిర్మాణ విభాగపు డీఈ అమర్‌బాబు, డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

మనస్తాపంతో కానిస్టేబుల్ ఆత్మహత్య

చౌడేపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు..స్థానిక గోసలకురప్పల్లెకు చెందిన లక్ష్మి పుంగనూరు రూరల్ సర్కిల్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవలి బదిలీల్లో గుడుపల్లెకు మారింది.నాలుగేళ్ళ క్రితం పలమనేరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేసే హరిప్రసాద్‌తో ఆమెకు వివాహం జరిగింది.గోసలకురప్పల్లెలోనే నివాసముంటున్నారు. వీరికి రెండేళ్ళ బాబున్నాడు.గత వారం కుమారుడికి తిరుపతిలో పుట్టెంట్రుకలు తీసే సమయంలో తన అక్క కూతురితో హరిప్రసాద్ సరిగా మాట్లాడలేదని లక్ష్మి మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో అమ్మ నాగమ్మ, భర్త హరిప్రసాద్, అక్క ఉమా హాల్లో కూర్చొని మాట్లాడుకుంటుండగానే లక్ష్మి బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపు లు వేసుకుని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది.కుటుంబీకులు వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.


లక్ష్మి(ఫైల్ ఫొటో)

తలకు కవర్ చుట్టి... తాడుతో గొంతు బిగించి...

● ప్రేమ వివాహం చేసుకున్న కూతుర్ని చంపిన తండ్రి అరెస్టు




యాస్మిన్(ఫైల్ ఫొటో)- నిందితులను చూపిస్తున్న సీఐ నెట్టికంఠయ్య- యాస్మిన్‌ను హతమార్చడానికి ఉపయోగించిన తాడు, కవర్

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):మతాంతరవివాహం చేసుకున్న చిత్తూరు యువతిని ప్లాన్ ప్రకారమే తండ్రి హత్య చేసినట్లు స్పష్టమైంది. తనకు ఆరోగ్యం బాగాలేదని కూతురిని ఇంటికి పిలిపించి ఇద్దరు బంధువుల సాయంతో దారుణంగా హత్య చేశాడు. గాయాలు కనిపించకుండా ఉండేందుకు ముందుగా తలకు కవర్ తొడిగి.. ఆ తర్వాత తాడుతో గొంతు బిగించి చంపేశాడు. తండ్రితో పాటు వరుసకు సోదరులయ్యే మరో ఇద్దరు ఈ హత్యలో పాల్గొని పరారయ్యారు. ఈ పరువు హత్య కేసులో 10 రోజుల తరువాత ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఆ వివరాలను చిత్తూరు టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య మీడియాకు బుధవారం వెల్లడించారు. చిత్తూరులోని బాలాజీ నగర్‌కు చెందిన షౌకత్ ఆలీ కుమార్తె యాస్మిన్, పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన దళిత యువకుడు సాయితేజ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈపెళ్లి ఇష్టంలేని యాస్మిన్ తండ్రి షౌకత్ ఆలీ ఎలాగైనా కూతుర్ని చంపాలని ప్లాన్ వేశాడు. తనకు ఆరోగ్యం బాగా లేదని, ఒకసారి వచ్చి చూసివెళ్లమని కుటుంబ సభ్యులతో కూతురికి చెప్పించాడు. దీంతో సాయితేజ ఈనెల 13న చిత్తూరులో యాస్మిన్‌ను తండ్రి షౌకత్ ఆలీ, సోదర వరసయ్యే ఖాదర్‌బాషా, అబ్దుల్‌కలాంలకు అప్పగించి వెళ్లాడు. వారు యాస్మిన్‌ను కారులో ఎక్కించుకుని ఇంటికి వెళతామని చెప్పి ఇక్కడి మాపాక్షి క్రాస్‌లోని బాలాజీ హేచరీస్ సమీపంలో ఉన్న బీడుభూముల వద్దకు తీసుకెళ్లి హతమార్చారు. అనంతరం శవాన్ని బాలాజీ నగర్‌కాలనీలోని ఇంటికి తీసుకొచ్చి వరండాలో పడుకోబెట్టి పరారయ్యారు. ఈ ఘటనపై యాస్మిన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య అని ప్రాథమికంగా అంచనాకు వచ్చి ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం చిత్తూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వద్ద షౌకత్ ఆలీ, బాషా లొంగిపోయారు. టూ టౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో బుధవారం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న అబ్దుల్‌కలాంను త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం మెండు

● కలెక్టర్ సుమిత్ కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం మెండుగా ఉంటుందని, ఆర్ఎస్‌కేల ద్వారా ఈ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లాలో ఆయిల్ పామ్ పంటసాగు విస్తీర్ణం పెంపుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ చెరకు ప్రధాన పంటకు బదులుగా మార్కెట్‌లో వంటనూనెల డిమాండ్ ఎక్కువగా వున్న దృష్ట్యా ఆయిల్ పామ్ మొక్కల పెంపకంతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. దీనికి పంటనష్టం తక్కువశాతం ఉంటుందని పేర్కొన్నారు. కార్వేటినగరం, గంగాధరనెల్లూరు, నింద్ర, నగరి, విజయపురం, శ్రీరంగరాజపురం మండలాల్లో ఈ పంట సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. చెరకు, మామిడిపంటకు ప్రత్యామ్నాయంగా ఈ పంట సాగుచేసేలా మండలాల్లో అధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సబ్సిడీ కింద రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ సౌకర్యం అందిస్తామని చెప్పారు. రైతులు ఈ పంట క్షేత్రాల్లో కోకో పంటలను సైతం అంతర్‌పంటగా వేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుత ఏడాది జిల్లాలో 900 హెక్టార్లలో పంటసాగుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, వివిధ ఆయిల్ పామ్ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పోప్ మృతికి సంతాపం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేథలిక్‌ల మతపెద్ద రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ మృతికి సంతాపంగా కలెక్టరేట్‌లో మంగళ, బుధవారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ జెండాను హాఫ్‌మస్ట్‌గా (సగం కిందకు దించి) అవనతం చేశారు. కేంద్ర ప్రభుత్వం పోప్ మృతికి మూడ్రోజులు సంతాప దినాలు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేర కలెక్టరేట్‌లో జాతీయ జెండాను అవనతం చేశారు.


కలెక్టరేట్‌లో జాతీయ జెండాను అవనతం చేసిన దృశ్యం

నిరుపయోగంగా నీటితొట్టెలు!


కార్వేటినగరం మండలం దిగువ ఎర్రమరాజుపల్లె కాలనీ వద్ద నిర్మించిన నీటి తొట్టె ఇలా....

వెదురుకుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన నీటి తొట్టె ఇది. వేసవికాలంలో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా వీటిని ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ కరువై ఇలా పాడైపోయాయి.పలు చోట్ల చెత్త కుండీలుగా మారిపోయాయి.వర్షపు నీరు నిల్వ చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి.మళ్లీ ఇప్పుడు లక్షలాది రూపాయల వ్యయంతో ఊరూరా నీటి తొట్టెల నిర్మాణం జరుగుతోంది. ఉపాధి హామీ పథకం నిధులతో పశువుల దాహార్తిని తీర్చడానికి అవసరమైన చోట్ల నీటి తొట్టెల నిర్మాణాలను చేపట్టారు.ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ నీటి తొట్టెల నిర్మాణాలు పూర్తయ్యాక వాటిని నీటితో నింపడానికి ఈసారైనా గట్టి చర్యలు చేపట్టాలి.మూగజీవాలకు వేసవి కాలంలో ఇబ్బందుల్లేకుండా తాగు నీటి వసతి కల్పించాలి.

నెలాఖరులోపు పలమనేరుకు కుంకీ ఏనుగులు



ఎలిఫెంట్ క్యాంపులో నిర్మించిన నీటి కుంట - క్రాల్ వద్ద రేంజర్ నాగరాజుతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు నెలాఖరులోపు కుంకీ ఏనుగులను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు సమీపంలోని మునలిమడుగు వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అటవీశాఖ ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ క్యాంపు పనులను బుధవారం అమరనాథరెడ్డి పరిశీలించారు. ఈ క్యాంపు వద్దకు కర్ణాటకలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను తీసుకొస్తున్నారు. కుంకీ ఏనుగుల ద్వారా జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో విచ్చలవిడిగా పంటపొలాలపై దాడులకు తెగబడుతున్న ఏనుగులను అటవీ లోతట్టు ప్రాంతాలకు తరలించేందుకు ఈ కుంకీ ఏనుగులను వినియోగించనున్నారు. ఎలిఫెంట్ క్యాంపులో పనులు తుది దశకు చేరుకోవడంతో ఇక కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. పలమనేరు రేంజర్ నాగరాజు ఎలిఫెంట్ క్యాంపు వద్ద చేపట్టిన పనులను వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కరెంటు పోతే లిఫ్ట్‌లో ఇరుక్కోకుండా
తిరుమలలో ఏఆర్డీ విధానం

అన్ని భవనాల్లో ఏర్పాటుకు టీటీడీ నిర్ణయం

తిరుమల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బహుళ అంతస్థుల భవనాలన్నింటిలోనూ లిఫ్టలకు ఆటోమెటిక్ రెస్క్యూ డివైజ్ (ఏఆర్డీ) ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఒక అతిథిగృహంలో మంగళవారం కరెంట్ పోవడంతో కడపకు చెందిన ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారు 18 నిమిషాల పాటూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన సంఘటన నేపథ్యంలో ఏఆర్డీ వ్యవస్థ అన్ని లిఫ్ట్‌ల్లోనూ తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. తిరుమలలో ప్రస్తుతం 7,500పైగా గదులున్నాయి. వీటిలో 80 శాతం భవనాల్లో లిఫ్టులు ఉన్నాయి. సాధారణంగా తిరుమలలో కరెంట్ సరఫరా నిలిచిపోయినప్పుడు 35 నుంచి 40 సెంకడ్లలలో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అయితే జనరేటర్ ఆన్‌లో ఉన్నప్పుడు గీజర్లు, ఏసీ, లిఫ్ట్ వంటివి పనిచేయవు. ఆ సమయంలో లిఫ్టలు తిరిగి కరెంటు వచ్చేదాకా ఎక్కడున్నవి అక్కేడే నిలచిపోతాయి. అటువంటి సందర్భంలో ఏఆర్డీ వ్యవస్థ గనుక ఉంటే సమీప అంతస్థులోకి చేరుకుని లిఫ్ట్ తలుపులు తెరుచుకుంటాయి. టీటీడీ ఈ విధానాన్ని గత మూడేళ్లుగా సన్నిధానం అతిథిగృహంలో వినియోగిస్తోంది. దాతల ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని అతిథిగృహాల్లో ఏఆర్డీ సిస్టమ్‌ను వెంటనే అమలుచేయాలని విద్యుత్ విభాగం అధికారులకు సూచనలు చేశారు. మిగిలిన భవనాల్లోనూ ఏర్పాటుకు టీటీడీ సిద్ధమవుతోంది.

విచారణకు హాజరైన డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సహకార చట్టం సెక్షన్-51 కింద జరుగుతున్న విచారణకు బ్యాంకు పాలకవర్గ మాజీ పర్సన్ ఇన్‌చార్జి ఎం.రెడ్డెమ్మ హాజరయ్యారు. బ్యాంకులో గత పాలకవర్గం చేసిన అధికార దుర్వినియోగం, అవినీతి, అక్రమాలపై డీసీసీబీ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. ఈ విచారణకు కలెక్టర్‌చే నియమితులైన డీఆర్వో మోహన్‌కుమార్ గతనెల 21వ తేది నుంచి వరుసగా విడతలవారీగా విచారణ చేస్తున్నారు. రెండుమూడు రోజుల క్రితం బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ భర్త మొగసాల కృష్ణమూర్తి విచారణకు హాజరయ్యారు. కాగా బుధవారం మొత్తం ఐదుగురికి నోటీసులు అందజేయగా, వారిలో రెడ్డెమ్మ కూడా ఒకరు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ జరగ్గా, ఐదుగురు హాజరై తమ వాంగ్మూలాన్ని అందజేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే శ్రీదుర్గ మృతి

టీడీపీ నాయకుల ఆరోపణ ● చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సీఎంవోకు ఫిర్యాదు


గాయాలతో శ్రీదుర్గ



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు మహిళా విభాగ కార్యాదర్శి శ్రీదుర్గ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి(అపోలో) వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. వారు చెబుతున్న మేరకు... ఈ నెల 21వ తేదిన సాయంత్రం శ్రీదుర్గ తన కుమారుడితో కలిసి బైక్‌పై ఫారెస్ట్ రోడ్డులో వెళుతుండగా మరో వాహనం రావడంతో అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలపై,ముఖంపై గాయాలయ్యాయి. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఎక్స్‌రే తీసి కాసేపు అబ్జర్వేషన్‌లో ఉంచి మందులు రాసిచ్చి డిశ్చార్జ్ చేశారు. ఆమె ఇంట్లో ఉంటూ వైద్యులు ఇచ్చిన మందులు వాడుకుంది. 23న ఉదయం నిద్ర లేవగానే స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడం వల్లే మృతి చెందిందని పోస్టుమార్టం రిపోర్టులో బహిర్గతమైంది. రోడ్డుపై నుంచి కంకర రాయిపై పడడంతో రాయి నేరుగా ఆమె తలకు గుచ్చుకోవడంతో మెదడుకు తీవ్ర గాయమైంది.అయితే దీన్ని వైద్యులు గమనించకపోవడం ఆమె ప్రాణాలు పోవడానికి కారణమైంది.మొదటే వైద్యులు గాయానికి సంబంధించిన అన్ని టెస్టులు చేసివుంటే ఆమె బతికేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు.శ్రీదుర్గ భర్త హోంగార్డుగా పనిచేస్తుండగా, వారికి ఇద్దరు కుమారులున్నారు. అపోలో వైద్యుల నిర్లక్ష్యపు వైద్యంతో మంచి నాయకురాలిని టీడీపీ కోల్పోయిందని చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం తరఫున సీఎంవోకు ఫిర్యాదు చేరింది. అంతపెద్ద గాయం తగిలితే చిన్న ఎక్స్‌రే తీసి ఇంటికి పంపించివేయడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా శ్రీదుర్గకు అందించిన వైద్యంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అపోలో యాజమాన్యాన్ని ఆరా తీశారు. సుమారు అర్థ గంటపైగా ఫోన్ ద్వారా జరిగిన విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

శ్రీదుర్గకు ఘన నివాళి : చిత్తూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):శ్రీదుర్గ అకాల మరణం టీడీపీకి తీరని లోటని పార్టీ నేతలు పేర్కొన్నారు.బీసీ నేత, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం కుమార్తె అయిన శ్రీదుర్గ (36) మరణించిన విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.స్థానిక సంతపేటలోని ఆమె నివాసం వద్దకు చేరుకుని శ్రీదుర్గ భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు.వీరిలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పులివర్తి వినీల్, సీఎం విజయ, వైవీ రాజేశ్వరి, మోహన్‌రాజ్ ,వెంకటేష్ యాదవ్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఎమ్మెల్యే జగన్మోహన్ కుటుంబ సభ్యులు వున్నారు.


శ్రీదుర్గ భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

నాన్నా.. లే నాన్న
మంచి మార్కులు సాధించా

● మృతదేహం వద్ద విలపించిన కుమారుడు

● కొడుకు మార్కులు తెలిసి సంబరపడ్డ కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం


జశ్వంత్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'నాన్నా.. నీ ముఖంలో నవ్వు కోసం నేను మంచి మార్కులు సాధించా. ఒకసారి లే.. నాన్నా' అంటూ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడిని చూసి అందరూ తల్లడిల్లారు. అంతకుముందే.. టెన్త్ ఫలితాల్లో తన కుమారుడికి మంచి మార్కులు వచ్చాయని తెలిసి మంచి బహుమతి తీసివ్వాలంటూ తన మిత్రుడి వద్ద సంబరపడ్డ ఆ తండ్రి.. కాసేపటికే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన శ్రీకాళహస్తి శివారులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేటకు చెందిన ముత్యాలయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్. ఈయనకు ఇద్దరు కుమారులు. తన స్థాయికి మించి.. పిల్లలిద్దరినీ కార్పొరేట్ పాఠశాలలో చదివించారు. పెద్ద కుమారుడు జశ్వంత్ ఇటీవల టెన్త్ పరీక్షలు రాశాడు. బుధవారం ముత్యాలయ్య ట్రాక్టర్ నడుపుకొంటూ తొట్టంబేడు మండలం లక్ష్మీపురం వచ్చారు. అక్కడి నుంచి వరిపొట్టు లోడుతో మిత్రుడు మస్తాన్‌బాషాతో కలిసి నాయుడుపేటకు బయలుదేరారు. ఇంతలో తన కుమారుడు 545 మార్కులతో టెన్త్ పాసయ్యాడని తెలిసి ముత్యాలయ్య సంబర పడ్డారు. పక్కనే ఉన్న బాషాతో సంతోషం పంచుకున్నారు. తన కుమారుడికి మంచి బహుమతి ఇవ్వడంతో పాటు స్నేహితులకు పార్టీ ఇవ్వాలని చెప్పారు. మార్గమధ్యలో శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారి పక్కన ట్రాక్టర్‌ను నలిపారు. బాషాతో కలిసి పక్కనే టిఫిన్ చేసేందుకు నిలబడి ఉండగా.. అటుగా వెళుతున్న ఓ ట్రాక్టర్ ముత్యాలయ్యను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు కుమారుడిని తలచుకుంటూ సంబరపడ్డ ముత్యాలయ్యను గుర్తు చేసుకుంటూ మిత్రుడు విలపించాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ముత్యాలయ్య కొడుకు జశ్వంత్ ఆస్పత్రికి చేరుకుని తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ విలపించాడు. నాన్నకు ప్రేమతో తన పది పరీక్ష ఫలితాలు అంకితం చేస్తున్నట్లు చెప్పాడు.


ముత్యాలయ్య (ఫైల్ ఫొటో)

ఉపాధ్యాయులు.. సమాజ నిర్మాతలు



రాజేంద్ర, వరలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, శ్రీనివాసులు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజేంద్ర ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల విద్యాభివృద్ధికి చేసిన రాజేంద్ర సేవలు అభినందనీయమన్నారు. అనంతరం రాజేంద్ర వరలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగ్రవాద సంస్థలను కఠినంగా శిక్షించాలి



ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఆర్మీ దుస్తులు ధరించి దాడి చేసిన ఉగ్రవాద సంస్థల ప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని శిక్షించాలని పుంగనూరు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన దాడులకు తామే బాధ్యత వహిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించడం దారుణమన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అయాబ్‌ఖాన్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నరసింహులు, నాయకులు కృష్ణమూర్తి, నానబాలకుమార్, నాగరాజ, అమరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడంతోనే జ్ఞాన సముపార్జన



పుస్తకాల ప్రదర్శనలో అధ్యాపకులు, విద్యార్థులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకాలు చదవడంతోనే జ్ఞాన సముపార్జన సాధ్యమని.. ఉన్నత స్థాయికి వెళ్లడానికి అవకాశాలు ఉంటాయని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పత్రికలు, నూతన పుస్తకాలు చదవడంతో కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరుసు స్థలంలో మౌలిక వసతులు



శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26, 27 తేదీల్లో పుంగనూరు ఉరుసు ఉత్సవాలు నిర్వహించే స్థలంలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్య లు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టి దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నూర్ షావలిబాబా దర్గా కమిటీ సభ్యులు, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా మనోజ్‌కుమార్



నియామక పత్రాన్ని అందుకుంటున్న మనోజ్‌కుమార్

రొంపిచెర్ల ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం చెంచ మరెడ్డిగారిపల్లెకు చెందిన చంద్రగిరి మనోజ్‌కుమార్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాలను అందించారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ బీసీల సమస్యలపై నిత్యం పోరాడుతానని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ చేపడుతున్న అధికారులు, విద్యార్థులు

రొంపిచెర్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ అన్నారు. బుధవారం ఆమె రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పాఠశాలలో రైతులు, ఉపాధ్యాయులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహారం తినడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. మాస్టర్ ట్రైనీ రమేష్ మాట్లాడుతూ ప్రతి మహిళా సంఘ సభ్యులు వ్యవసాయంలో భాగసామ్యమై ప్రజలకు మార్గదర్శకులు కావాలన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జీలు కోమల, రెడ్డెమ్మ, ఫార్మల్ సైంటిస్టు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో అమరనాథరెడ్డి



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కనపల్లె గ్రామంలో బుధవారం జరిగిన గంగజాతరలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు, టీడీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా పాల్గొన్నారు.



● చౌడేపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్రెడ్డిపల్లెలో బుధవారం నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. వేకువ జామున గ్రామ పొలిమేరల్లో నలువైపులా ఉన్న గ్రామదేవతలకు మహిళలు దివ్వెలు, దీపాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సర్కారు బడుల్లో ఫలితాల ప్రభంజనం



సుమశ్రీ



గంగోత్రి



లేఖన,



హరిహరకుమార్



మంజుల



చందు



లక్ష్మీప్రణతి



దేవనందిని



అనూష



రితిక



రెడ్డి ప్రసన్న



శిల్ప



కుప్పం: కేపీసీలో ప్రతిభ చూపిన విద్యార్థులతో చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ తదితరలు



పలమనేరులో విద్యార్థిని భావనను అభినందిస్తున్న ఎంఈవో లీలారాణి, ఉపాధ్యాయులు



ప్రవల్లిక



కుష్నిహాజ్,



సబియాఫిర్దోస్,



అఫాన్



వి.రిషిత



యోగేశ్

కుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ, మండలంలో కలిపి పదో తరగతి పరీక్షల్లో 56 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో-2 రాజారామ్ తెలిపారు. పరమసముద్రం గురుకుల పాఠశాల (ఏపీఎస్ డబ్ల్యుఆర్ఎస్) 91 శాతం, టి.సదుమూరు జడ్పీ హైస్కూల్ 88 శాతం, ఆర్ఎస్ పేట జడ్పీ హైస్కూల్ (ఉర్దూ) 83 శాతం ఫలితాలతో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచాయి. గరిచీనపల్లె జడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.శ్రావణి, సి.వెన్నెల 586 మార్కులతో కుప్పం మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. అడవిబూదుగూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.హారిక 584 మార్కులు, వసనాగు జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.అర్జున్ 576, పరమసముద్రం గురుకుల పాఠశాల విద్యార్థిని టి.లహరి 574 మార్కులతో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు.

● కుప్పం పబ్లిక్ స్కూల్‌లో: బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు పాఠశాల చైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రధానోపాధ్యాయురాలు దమయంతి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు సి.కిరణ్ కుమార్, అక్షర, కె.రుచితలతోపాటు 18 మంది విద్యార్థులు 550, ఆపైన మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

● పలమనేరు: పలమనేరు మండలంలో పదో తరగతి పరీక్షల్లో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో లీలారాణి తెలిపారు. మండలంలోని మొత్తం 10 ఉన్నత పాఠశాలల నుంచి 1,236 మంది పరీక్షలు రాయగా 866 మంది ఉత్తీర్ణత సాధించారు. పలమనేరులోని బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వి.భావన 600 మార్కులకు గాను 588 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో అదే పాఠశాల విద్యార్థిని ప్రవల్లిక 585 మార్కులు, కొలమాసనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.చిత్ర 573 మార్కులు సాధించి తృతీయస్థానంలో నిలిచింది.

● కల్లూరు: పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్లుగా కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచినట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుష్నిహాజ్ 587 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థిని సబియాఫిర్దోస్ 576 మార్కులతో రెండో స్థానం, విద్యార్థి అఫాన్ 563 మార్కులతో మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

రొంపిచెర్ల టాపర్‌గా రిషిత

● రొంపిచెర్ల : పదో తరగతి ఫలితాల్లో రొంపిచెర్ల మోడల్ స్కూల్ విద్యార్థిని వి.రిషిత 586 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థినిని ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందించారు.

● గుడుపల్లె: గుడుపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 54 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీదేవి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కమ్మనపల్లె విద్యార్థినుల ప్రతిభ

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తాచాటారని ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. విద్యార్థినులు మంజుల, చందు 590 మార్కులు సాధించి మండల టాపర్స్‌గా నిలిచారు. అలాగే లక్ష్మీప్రణతి 589 మార్కులతో ద్వితీయ స్థానం, దేవనందిని, అనూష 588 మార్కులు సాధించి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు.

బైరెడ్డిపల్లెలో 67.70 శాతం ఉత్తీర్ణత

బైరెడ్డిపల్లె: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 67.70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తెలిపారు. మొత్తం 721 మంది విద్యార్థులకు గాను 482 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

పెద్దపంజాణి మండల టాపర్‌గా సుమశ్రీ

● పెద్దపంజాణి: పదో తరగతి పరీక్ష ఫలితాలలో పెద్దపంజాణి మండలంలోని ఎంజేపీ పీఏపీబీసీడబ్ల్యూఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.సుమశ్రీ 587 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని ఎంఈవో గోపాల్‌రెడ్డి తెలిపారు. శంకర్రాయలపేట పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.గంగోత్రి 583 మార్కులు, ఆర్.లేఖన, హరిహరకుమార్‌లు 581 మార్కుల చొప్పున సాధించారని పేర్కొన్నారు.

● వి.కోట: పదో తరగతి ఫలితాల్లో వి.కోట మండలంలో బాలికలే టాపర్లుగా నిలిచారు. వి.కోట బాలికోన్నత పాఠశాలకు చెందిన రితిక 584 మార్కులతో టాపర్‌గా నిలిచింది. సి.ఎల్లాగరానికి చెందిన వి.నిర్మల 571, పడిగలకుప్పానికి చెందిన చైత్ర 566 మార్కులు సాధించారు.

● పుంగనూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పుంగనూరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని రెడ్డిప్రసన్న 589 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో కొత్తయిండ్లు హైస్కూల్ విద్యార్థిని శిల్ప 586, యోగేశ్ 585 మార్కులు సాధించి ప్రతిభ చూపారు.

విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం. వెంకటేసులు

పలమనేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆంగ్లభాషలో మంచి పట్టు సాధించాలని.. నేడు పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందుతారని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఐక్యూ న్యాక్ కో ఆర్డినేటర్ బేనజీర్, డబ్ల్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ శశికళ, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ జయశంకర్, కళాశాల అధ్యాపకులు సురేష్‌కుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభం



ఎన్నికల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని బేలుపల్లెలో బుధవారం టీడీపీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభమయ్యాయి. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో బేలుపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా పయణివేల్, ప్రధాన కార్యదర్శిగా నారాయణరెడ్డిని ఎంపిక చేశారు. అలాగే కమ్మనపల్లె పంచాయతీ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రేణుకప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వారిని నాయకులు అభినందించారు.

ఉగ్రవాదంతో భారత్‌ను భయపెట్టలేరు



కుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): ఉగ్ర వాదంతో భారత్‌ను ఏ ముష్కరులూ భయపెట్టలేరని జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్ అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మ శాంతించాలని కోరుతూ కుప్పం పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, ప్రజలు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



● పుంగనూరు: దాడులకు పాల్పడిన ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పుంగనూరులో హిందూ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. బుధవారం కశ్మీర్‌లో తీవ్రవాదుల దాడులకు నిరసనగా హిందు జాగరణ సమితి, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలసి ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాగడాలు, కొవ్వొత్తుతో స్థానిక ఇందిరాసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10న పలమనేరు కోర్టు ఆవరణలో జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత కోరారు. బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి లిఖిత మాట్లాడుతూ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించేందుకు అందరూ సహకరించాలన్నారు. లోక్ అదాలత్ లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు ఇప్పటి నుంచి కక్షిదారులతో చర్చించాలని తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడంతో కక్షిదారులకు విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి, పరమశివప్ప, మోహన్‌రెడ్డి, న్యాయవాదులు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పలమనేరు సీఐ నరసింహరాజు, వి.కోట సీఐ సోమశేఖర్‌రెడ్డి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడిన వారికే పదవులు



నూతనంగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న నేతలు

వి.కోట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడే ప్రతిఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వి.కోట, కొంగాటం పంచాయతీ పరిధిలో పార్టీ సంస్థాగత ఎన్నికలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వి.కోట మేజర్ పంచాయతీ పార్టీ అధ్యక్షులుగా జీఎం సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా మురళీ, యూత్ అధ్యక్షులుగా సతీష్, కొంగాటం అధ్యక్షులుగా సర్దార్, కార్యదర్శిగా ప్రవీన్‌కుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షులుగా ఆనందనాయుడులను ఎన్నుకున్నారు. వీరితో పాటు పార్టీ అనుబంధ కమిటీలను ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, చౌడప్ప, చంద్రారెడ్డి, ధీరజ్, శబరీష్, విశ్వనాథరెడ్డి, కేశవరెడ్డి, నారాయణస్వామి, రుహుల్లా, రాము, జనార్దన్‌రెడ్డి, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోలో మెకానిక్, పెయింటర్, టైర్ మెకానిక్, అసిస్టెంట్ మెకానిక్‌గా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు 18 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. సంబంధిత ట్రేడ్ ఐటీఐ, ఎన్టీసీ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలని, గవర్నమెంట్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ ద్వారా మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నేషనల్ అప్రెంటిస్ షిప్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. హెవీ వెహికల్ మెయింటెనెన్స్‌లో 3 సంవత్సరాల అనుభవానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

30న ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

పలమనేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో ఈనెల 30న వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ భాగ్యలక్ష్మి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 30న ఉదయం 10 గంటలలోపు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు.

సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



కుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం బ్రహ్మదేవరచేన్లు గ్రామంలో బుధవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో అక్రమంగా నిల్వ ఉన్న 36 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో బ్రహ్మదేవరచేన్లు గ్రామానికి చెందిన తిరుపతి, వీర్నమల గ్రామానికి చెందిన ఆర్.గోవిందన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. నిందితులకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. రాజేంద్ర అనే మరో వ్యక్తి పరారయ్యారన్నారు. ఈ దాడుల్లో సీఐతోపాటు ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, దిలీప్ కుమార్, సిబ్బంది చలపతి ఆచారి, వెంకటేశ్, రమేశ్, కిరణ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

స్వయంభేశ్వరస్వామికి అభిషేకాలు

సోమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో 101 నీటి బిందెలతో భక్తులు శివనామ స్మరణలతో ఆలయాన్ని శుద్ధి చేశారు. సాయంత్రం దేవాంగ కుటుంబసభ్యులు ఉభయదారులుగా ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ ధర్మకర్త సోమశేఖర్, ఉభయదారులు పాల్గొన్నారు.

బస్టాండులో ఆర్టీసీ బస్సులు నిలపాలి



సమావేశంలో ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ ప్రభాకర్

సోమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సోమల ఆర్టీసీ బస్టాండ్‌లోకి తిరుపతి - పుంగనూరు మార్గం బస్సులు రావడం లేదని.. ప్రజల సౌకర్యార్థం వెంటనే చర్యలు తీసుకోవాలని సోమల వైస్ ఎంపీపీ ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచి ప్రయాణీకులతో వచ్చే పుంగనూరు డిపో బస్సులు బస్టాండులోకి రాకుండా దూరంగా వెళ్లి ఆపుతున్నారని వాపోయారు. గత మండల సమావేశంలో సమస్యను అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. మండలంలోని వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలను రద్దు చేస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతారని ఇరికిపెంట ఎంపీటీసీ హరినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ పథకం నిధులతో ఇరిగేషన్ పనులు చేసినా బిల్లులు మంజూరు కాలేదని సభలో అధికారులను కోరారు. ఉద్యాన శాఖ నుంచి రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వడం లేదని.. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు మామిడి, టమోటా పంటలకు నష్టం జరిగిందని పలువురు సభ్యులు వాపోయారు. అలాగే ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో నకిలీ మందులు, నాణ్యత లేని మందుల అమ్మకాలు జరగకుండా అధికారులు తనిఖీలు చేయాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. దుకాణదారులు బిల్లులు ఇవ్వడంలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణ, ఎంఈవోలు శివరత్న, కేశవరెడ్డి, పశువైద్యాధికారి చందనప్రియ, ఏపీఎం శివ, ఏపీవో షౌకత్, మండల కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, జేఈలు మహేంద్రరెడ్డి, అనూష, ఆనంద్, వైద్యాధికారి నీలిమా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళాసాధికారతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భానుప్రకాష్



కుట్టుమిషన్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మున్సిపాలిటీలోని కీలపట్టులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళ తమ ఇంటిని ఆర్థికంగా అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా, నేతలు అల్లిముత్తు, రుక్మం బాలాజీ, గుణశేఖర్, అవోక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కేజీకుప్పం ఆది ఆంధ్రవాడలో వరదల కారణంగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో నూతనంగా పక్కా గృహాలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. ఇళ్లు కోల్పోయిన ఆరుగురికి గృహాలు మంజూరు కావడంతో హౌసింగ్ అధికారులతో కలిసి బుధవారం ఆయన కేజీకుప్పం ఆది ఆంధ్రవాడలో పర్యటించారు.

అవినీతి రహిత నియోజకవర్గమే సంకల్పం

● ప్రభుత్వ విప్ థామస్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వవిప్ థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే సంకల్పమని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయం వద్ద 'ప్రజా సమస్యల పరిష్కారం వేదిక' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన థామస్ మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారులను నమ్మిమోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. తర్వాత పెరుమాళ్లపల్లె కాలనీలో పర్యటించారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ పాడె మోసిన ఎమ్మెల్యే



ధనంజయ నాయుడి పాడె మోస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ వైస్ ఎంపీపీ పత్తిపాటి ధనంజయ నాయుడు పాడెను బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్ బాబు మోశారు. ధనంజయ నాయుడి భౌతికకాయం తన స్వగ్రామమైన నాంపల్లెకు చేరుకోగానే ఎమ్మెల్యే అక్కడకు చేరుకుని ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ధనంజయ నాయుడి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి లభించాలని దేవుని ప్రార్థించినట్లు తెలిపారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యువరాజులు నాయుడు, చిత్తూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ ఎంపీపీ శాంతమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండండి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో పెద్దిరెడ్డి చెప్పారు. బుధవారం యాదమరి మండలంలోని (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)లో కార్మికులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ఐఓసీఎల్‌లో డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉంటాయని, ఇక్కడ సెక్యూరిటీ, కార్మికులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం డీఎఫ్‌వో సెక్యూరిటీ సిబ్బందికి, కార్మికులకు ట్రైనింగ్ మెటీరియల్‌ను అందజేశారు. ఏడీఎఫ్‌వో కరుణాకర్, ఎల్ఎఫ్ ఏసుపాదం, శోభన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా మీటింగ్‌కు ఇద్దరు నేతలే హాజరు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో బుధవారం సాయంత్రం ఓటర్ల జాబితాపై నియోజకవర్గంలోని పార్టీల నేతలకు, తహసీల్దార్లకు జరిగిన మీటింగుకు ఎక్కువమంది గైర్హాజరయ్యారు. ఓటర్ల జాబితాపరంగా, పోలింగ్ కేంద్రాల్లో సమస్యల గురించి తెలియజేసి పరిష్కరించుకునేందుకు జరిగిన ఈ మీటింగ్ చివరికి ఇలా ముగిసింది. ఎన్నికల డీటీ మోహన్‌రాజతో పాటు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, గంగాధరనెల్లూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఆనందబాబు, పాలసముద్రం తహసీల్దార్ అరుణకుమారి మాత్రమే హాజరయ్యారు. నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి వెంకటశివ కోర్టు వాయిదా కారణంగా, తహసీల్దార్ చంద్రశేఖర్ చిత్తూరుకు వెళ్లాల్సి ఉండడంతో రాలేకపోయారు. శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పెనుమూరు తహసీల్దార్లు హాజరుకాలేదు. టీడీపీ, వైసీపీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ, జనసేన పార్టీలకు చెందిన నేతలు కూడా హాజరు కాలేదు.

కశ్మీర్లో దాడులు హేయం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్లో జరిగిన ఉగ్రదాడులు హేయమైన చర్య అని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే నాయకులన్నారు. బుధవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు చిత్తూరు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

ఐడీఆర్ఎఫ్ కింద రూ.1.50 లక్షల చెక్కు అందజేత

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఐడీఆర్ఎఫ్ కింద రూ.లక్ష, విడో ఫండ్ కింద మరో రూ.50వేల చెక్కును బాధిత కుటుంబానికి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అందించారు. జిల్లా నుంచి అటాచ్‌మెంట్‌లో భాగంగా తిరుపతి జిల్లాలో క్లాస్-4 ఉద్యోగినిగా ఉన్న శ్యామలాకుమారి ఈ నెల 22న అనారోగ్యంతో మృతి చెందారు. దాంతో ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన రూ.1.50 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో మృతురాలి కుమారుడు పృథ్వీకి అందించారు. సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ రెడ్డప్ప పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: డీపీవో

వెదురుకుప్పం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావు అన్నారు. బుధవారం కార్వేటినగరంలోని లక్ష్మీనరసింహా విద్యాసంస్థ 14వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్, ఎంపీడీవో చంద్రమౌళి, విద్యాసంస్థల అధినేత దిలీప్‌కుమార్, ఎంఈవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వెదురుకుప్పం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం జక్కిదొనకు చెందిన లబ్ధిదారురాలు లక్ష్మీకాంతమ్మ తరఫున సీఎం సహాయనిధి రూ.125000 చెక్కును బుధవారం ప్రభుత్వ విప్ థామస్ ఆమె భర్త తులసీయాదవ్‌కు అందజేశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గాలి బాబు నాయుడు, నాయకులు పి.మోహన్‌మురళి, బీఎం రవి, సాతాల గుణశేఖర్‌యాదవ్, చెంగల్రాయరెడ్డి పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించాలి: డీఎస్పీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఫైర్ సేఫ్టీ నియమాలను పాటించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆదేశించారు. బుధవారం కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజకుమార్ సిబ్బందితో కలసి కార్వేటినగరంలోని అన్నూరు వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే వర్కర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ, లేబర్ యాక్ట్ గురించి వివరించారు.

లగేజీ ఆటోకు ప్రమాదం



ప్రమాద సమాచారం తెలుసుకుంటున్న థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి లగేజీ ఆటో (టాటాఏస్)కార్వేటినగరం వైపు నుంచి పళ్లిపట్టు వైపు వెళ్తున్న సమయంలో అదుపు తప్పి ప్రమాదం జరిగిందని ప్రభుత్వ విప్ థామస్ అనుచరులు తెలిపారు. అదే సమయంలో వెదురుకుప్పం మండలంలో థామస్ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో కొల్లాగుంట జంక్షన్ సమీపంకు వెళ్లేసరికి ప్రమాదం జరిగి ఉంది. వెంటనే కారు ఆపి ప్రమాద విషయాలు తెలుసుకుని సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే లగేజీ ఆటోలు, ప్యాసింజర్ ఆటోల్లో ఓవర్‌లోడ్ వేసుకుని వెళ్లకూడదని, రోడ్డు నియమాలని పాటించాలని థామస్ సూచించారు. దీనిపై కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు అందలేదని సమాచారం.

కోసలనగరం సింగిల్‌విండోకు రెగ్యులర్ సీఈవోని నియమించండి

విజయపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం సింగిల్ విండోకు రెగ్యులర్ సీఈవోను నియమించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రమైన విజయపురంలో కోసలనగరం సింగిల్ విండో కార్యాలయం గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి పాలనలో సాగుతోంది. ఇన్‌చార్జి సీఈవోపై పలు అవినీతి ఆరోపణలు వస్తున్నాయని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం వచ్చే వారి వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, పరుష పదజాలంతో మాట్లాడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సొంత ప్రయోజనాల కోసం సహకార బ్యాంకును వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు విచారణ నిర్వహించి, రెగ్యులర్ సీఈవోను నియమించాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ కార్యకర్తకు నివాళి

గుడిపాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పిగానిపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్త ప్రేమ్‌కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి ప్రేమ్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న విజయానందరెడ్డి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. వైసీపీ నేతలు మధుసూదన్ రాయల్, గడ్డం విజయ్, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం: రాగి వైరు చోరీ

పాలసముద్రం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో మంగళవారం రాత్రి షణ్ముగం, యువరాజ్ అనే రైతుల పొలంలోని 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దొంగలు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ ఎత్తుకెళ్లినట్లు రైతులు ట్రాన్స్‌కో ఏఈ లోకేష్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

పాత టైర్ల కంపెనీలో పేలుళ్లు

● ఎగసిపడ్డ మంటలు

● భయభ్రాంతులకు గురైన స్థానికులు



టైర్ల కంపెనీలో పేలుడుతో మంటలు ఎగసిపడుతున్న దృశ్యం

నగరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని నాగరాజకుప్పం వెళ్లే దారిలో జగనన్న లేఅవుట్ సమీపాన గల పాత టైర్ల కంపెనీలో బుధవారం ఉదయం 4.45 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించడంతో మంటలు ఎగసిపడ్డాయి. పెద్దశబ్దాలతో మంటలు ఉవ్వెత్తున ఎగసి పడటంతో సమీపాన గల హౌసింగ్‌కాలనీతో బాటు సమీప గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న నగరి ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వినయ్ సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి చెందిన దీపం ఇండస్ట్రీస్‌లో పాత టైర్ల నుంచి కర్బనం, ఆయిల్ తదితరాలను తయారుచేసి బయట ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. చుట్టుపక్కల 1752 ఇళ్లు ఉన్నాయని, ఈ కంపెనీవలన కాలుష్య సమస్య ఉందని, రోగాలు వస్తున్నాయని పలుసార్లు మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. నాగరాజకుప్పం మాజీ సర్పంచి సెల్వమణి మాట్లాడుతూ వేకువఝామున జరగడంతో ఎలాంటి సమస్య లేకుండా పోయిందని, అదే పగటిపూట జరిగుంటే ఆరోడ్డుపై వెళ్లే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయేవన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ ఫ్యాక్టరీని మూసివేయించి ప్రజల ఆరోగ్యం కాపాడాలన్నారు. అటువైపుగా వెళ్లిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు ఫ్యాక్టరీ వలన కలిగే సమస్య గురించి స్థానికులు వివరించారు.

యూరో లేజర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే మురళీమోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో హాస్పటల్‌లో అధునాతన పద్ధతిలో నూతనంగా ఏర్పాటు చేసిన యూరో లేజర్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. బుధవారం అరగొండ అపోలో హాస్పటల్‌లో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన మూత్రపిండాల్లో రాళ్లు తొలగించే యూరో లేజర్ సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కోసం అరగొండ అపోలో హాస్పటల్‌లో జిల్లాలోనే మొదటగా యూరో లేజరు సేవలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అపోలో హాస్పటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి తన స్వగ్రామమైన అరగొండలో సేవాభావంతో అధునాతన వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజల కోసం తీసుకువచ్చారన్నారు. ఆయన ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలుస్తారన్నారు. అపోలో జనరల్ మేనేజరు డాక్టర్ వినోద్, అరగొండ అపోలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, యూరాలజిస్టు శంకర్, వైద్యులు జోత్స్న, రేష్మ, పీఆర్వో కమరుద్దీన్, అపోలో సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్ అలేఖ్య



క్షూరికాపురంలో అలేఖ్యకు స్వీటు తినిపిస్తున్న తల్లి హేమావతి

విజయపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్షూరికాపురం గ్రామానికి చెందిన అలేఖ్య పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 592 మార్కులు సాధించడంతో పలువురు శభాష్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. విజయపురం ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ పట్టుదల, కృషితో మండల టాపర్‌గా నిలిచింది. ఆమె మండలంలోని క్షూరికాపురంలో మునిశేఖర్, హేమావతి దంపతుల రెండవ కుమార్తె. అక్క, తమ్ముడు ఉన్నారు. ముగ్గురూ ప్రైవేటు పాఠశాలలో చదువుతుండగా తండ్రి అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లి దిక్కు తోచక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ పిల్లలను చదివించడంతో కష్టానికి తగిన ఫలితం వచ్చిందని ఆమె తల్లి కంటతడి పెట్టి ఆనందం వ్యక్తంచేశారు. పిల్లల చదువే లక్ష్యంగా జీవిస్తున్నానని, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. అలేఖ్యకు స్వీట్లు తినిపించి, స్వీటు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.

పాఠశాల వార్షికోత్సవం



రైటింగ్ ప్యాడ్లు అందజేస్తున్న ఎంఈవో

యాదమరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం పిళ్లై, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, స్థానిక ఎంపీటీసీ రవీంద్ర బాబు పాల్గొన్నారు. విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్‌తో పాటు పరీక్ష సామగ్రిని, ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ



ఎండీ సతీష్ (582)

నగరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్‌గా చింతలపట్టెడ ఉన్నతపాఠశాల 81 శాతం సాధించగా, చివరిస్థానం 37 శాతంతో ఎం.కొత్తూరు ఉన్నతపాఠశాల నిలిచింది. నగరి మండలం, పట్టణ పరిధిలో 12 ఉన్నత పాఠశాలల్లో 922 మంది పరీక్షలు రాయగా, 543 మంది పాసై 58.39 శాతం ఉత్తీర్ణత నమోదైంది. నగరి ఉన్నత పాఠశాలలో ఎండీ సతీష్ 582 మార్కులు సాధించి పట్టణ టాపర్‌గా నిలిచాడు. ఏకాంబరకుప్పంలో ఎండీ సతీష్‌కుమార్ 575, పుదుపేటలో కేడీ ఐశ్వర్య 569, నగరి బాలికల పాఠశాలలో ఆర్.ధావని 557, నాగరాజకుప్పం ఉన్నతపాఠశాలలో లిరీష 550 మార్కులు సాధించారు. సత్రవాడలో కావ్య 549, పొన్నజి 549, ఎం.కొత్తూరులో లీలాశ్రీ 537, తడుకుపేటలో శశికాంత్ 535, ముడిపల్లిలో అలేఖ్య 517, పీసీఎన్ ఉన్నత పాఠశాలలో వెంకటేశ్ 513 మార్కులు సాధించి పాఠశాలల టాపర్లుగా నిలిచారు.

● వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలో టెన్త్ పరీక్షలను 411 మంది విద్యార్థులు రాయగా, 294 మంది పాసై 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. కత్తెరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.ప్రశాంత్ 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు.

● గుడిపాల: టెన్త్ ఫలితాల్లో కమ్మతిమ్మాపల్లె హైస్కూల్ విద్యార్థిని సింధుభార్గవి 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బొమ్మసముద్రం హైస్కూల్‌లో 60 మందికిగాను 58 మంది, శ్రీరంగనపల్లెలో 30మందికి గాను 29 మంది, కమ్మతిమ్మాపల్లెలో 39 మందికి 39 మంది, ఏఎల్‌పురంలో 30 మందికిగాను 30 మంది ఉత్తీర్ణులయ్యారు. నరహరిపేటలో 90 మందికిగాను 85 మంది, చిత్తపారలో 16 మందికి గాను 16 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో గణపతి తెలిపారు.



విష్ణు (581)

● శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి విష్ణు 581 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. 49.కొత్తపల్లెమిట్ట విద్యార్థిని నవ్యశ్రీ 576 మార్కులతో రెండవస్థానం, హరిశంకర్ నాయుడు 569 మార్కులతో మూడవ స్థానం సాధించారు. ఎస్ఆర్‌పురం మండలంలో 284 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 87మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో మొత్తం 30శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో అరుణాచలంరెడ్డి తెలిపారు.

● విజయపురం: మండల కేంద్రమైన విజయపురం ఉన్నత పాఠశాలలో అలేఖ్య 592 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, నితీష్ కల్యాణ్ 560 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో శ్యామల తెలిపారు. పన్నూరు ఉన్నత పాఠశాలలో రుకేష్‌వర్మ 563, సంజన 527 మార్కులు సాధించారు. శ్రీహరిపురంలో పాండునాథ్ 527, భాను 468 మార్కులు సాధించారు. జంబాడలో ప్రియదర్శిని 522, దీపిక 513 మార్కులు సాధించారు. మండలంలో పదవ తరగతిలో ఫలితాలు 72 శాతం వచ్చిందన్నారు.



జయంత్ (583)

● ఐరాల: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఐరాల మండలం ఎం.పైపల్లె జడ్పీహైస్కూల్ విద్యార్థి జయంత్583 మార్కులతో టాపర్‌గా నిలిచినట్లు ఎంఈవో దామోదర్ నాయుడు తెలిపారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నుఖిత 581, కాణిపాకంలో లక్ష్మీప్రసన్న 506, పొలకలలో జోత్స్న ప్రియ 540, పుత్రమద్ది జడ్పీ హైస్కూల్‌లో మౌనిక 510 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. మండలంలో 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

● పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి అభినయ 563 మార్కులు సాధించినట్లు ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్‌లో 90 శాతం, ఎస్ఆర్ఆర్.కండ్రిగలో 88 శాతం, పాలసముద్రంలో 82 శాతం, వెంగళరాజుకుప్పం 88 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● యాదమరి: మండలవ్యాప్తంగా 412 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 265 మంది ఉత్తీర్ణులై 64శాతం సాధించారు. మారుమూల అటవీప్రాంతంలో సరైన వసతులు లేని దిగువ కణతలచెరువు జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న బి.భూమిక 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. కాశిరాల గొల్లపల్లి పాఠశాల విద్యార్థిని ద్రాక్షాయణి 563 మార్కులు సాధించింది. యాదమరి హైస్కూల్‌లో చదువుతున్న కె.పల్లవి 561 మార్కులు సాధించింది. చిన్నరెడ్డిపల్లి 14 కండ్రిగ ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం భాస్కర్ రావు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, లలిత, గిరిరాజా, ఉపాధ్యాయులు అభినందించారు.



మోహనక్రిష్ణ (585)

● పూతలపట్టు: పది పరీక్షల్లో పి.కొత్తకోట ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న దీపిష 586 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే కొత్తకోట సమీపాన గల గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న మోహనక్రిష్ణ 585 మార్కులు సాధించి రెండో టాపర్‌గా నిలిచాడు.

● నింద్ర: నింద్ర మండలంలో 65 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వసుమతి దేవి, శ్రీధర్‌రాజు తెలిపారు. మండల టాపర్‌గా నింద్ర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ అనుషా 542, ద్వితీయ స్థానంలో జే.స్నేహిత, తృతీయ స్థానంలో ఆరూరు ఉన్నత పాఠశాలను చెందిన ఏ.గౌతమ్ 524 నిలిచినట్లు తెలిపారు. నింద్ర ఉన్నత పాఠశాల 65.9 శాతం, ఆరూరు ఉన్నత పాఠశాలలో 75 శాతం, అత్తూరులో 64 శాతం, శ్రీరామపురం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 26 శాతం, చవరంబాకంలో 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.



హిమశ్రీ, పునీత్ సాయి (584)

● బంగారుపాళ్యం: మండలంలోని మంగళపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఏపి హేమ 592 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలలో చదివిన ఎస్.హిమశ్రీ 584 మార్కులు, కె.పునీత్‌సాయి 584 మార్కులు సాధించి ద్వితీయ, గుండ్లకట్టమంచి జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.చరణ్ 576 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. బంగారుపాళ్యం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఆర్.ఇందుప్రియా 570 మార్కులు సాధించినట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 43 శాతం ఉత్తీర్ణత పొందారని ఆయన చెప్పారు. మొదటి స్థానంలో నిలిచిన ఏపీ హేమను సర్పంచి కుప్పాల మురళి, మండల టీఈపీ అధ్యక్షుడు ఎన్నీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్ నాయుడు, హెచ్‌ఎం రాజ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు అరుణశివప్రసాద్, గంటా మోహన్, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.



యోగిత (583)

● గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు 90శాతం ఫలితాలు సాధించారని ఎంఈవోలు ఆంజినేయులు శెట్టి, గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. గంగాధరనెల్లూరు (సర్విరెడ్డిపల్లె బస్టాప్) సమీపంలో గల బాలికల గురుకుల పాఠశాలలో ఎం.లక్ష్మీదీక్షిత 581 మార్కులు, డి.హాసిని 571, నెల్లేపల్లె జడ్పీ హైస్కూల్లో పి.హితేష్ 581, ఎస్.హర్షిత 573, పెడకంటిపల్లెలో జి.పి.గీతికశ్రీ 535, డి.దీక్షిత 531 మార్కులు, కాళేపల్లె జడ్పీ హైస్కూల్లో ఆర్.యోగిత 583, జి.బిందు 568 మార్కులు సాధించారు. మేనాటంపల్లెలో ఎ.హర్షప్రియ 524, టి.బేబిరెడ్డి 506, వేపంజేరిలో బి.తులసి 552, వై.హరీష్‌రెడ్డి 549, బాలగంగనపల్లెలో జి.అర్చన 570, 564, గంగాధరనెల్లూరు జడ్పీ హైస్కూల్లో పి.డిల్లీప్రసన్న 548, తూగుంద్రంలో వి.నీలిమ 548 మార్కులు సాధించారు.

● పెనుమూరు: పెనుమూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం 54 శాతమే కావడం గమనార్హం. మండలంలో మొత్తం 210 మంది పరీక్షలు రాయగా, 114 మంది పాస్ కాగా, 96 మంది ఫెయిలయ్యారు. పెనుమూరు హైస్కూల్ విద్యార్థి జ్ఞానహర్ష 571 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచాడు. ఉగ్రాణంపల్లి పాఠశాలలో పూర్ణిమ 569 మార్కులు సాధించగా, ఎల్‌కేపీ ఊరు పాఠశాలలో లక్ష్మీ 556 మార్కులు సాధించారు.

● తవణంపల్లె: తవణంపల్లె మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 237 మంది పరీక్షలు రాయగా 174 మంది ఉత్తీర్ణత సాధించారు.

రిటైర్డ్ పీఈటీ కన్నుమూత

వెదురుకుప్పం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరానికి చెందిన రిటైర్డ్ పీఈటీ ఆర్ ఎస్ కుమారరాజు(80) బుధవారం మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. ఈయన 35 ఏళ్లపాటు పీఈటీగా సేవలందించి, రాష్ట్ర స్థాయి అవార్డు తీసుకున్నారని తెలిపారు. మృతుడి కుమారుడు ఆర్ఎస్ ఉపేంద్రరాజు రెవా యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్వేటినగరంలో గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లిమిట్ట దళితవాడలో కరెంట్ లేక ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో స్థానిక టీడీపీ నాయకులు ప్రభుత్వ విప్ థామస్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో, వారు స్పందించి బుధవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను 49.కొత్తపల్లిమిట్ట దళితవాడలో ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మురుగేష్, జీవన్‌కుమార్, కన్నయ్య, పాల్‌రాజ్, నాగారాజు, సత్యరాజ్ పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో విజయం ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న విజయం అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి - ప్రకాశం స్కూల్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసిన టెన్త్ ఫలితాల్లో స్థానిక విజయం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి తెలిపారు. 600 మార్కులకు గాను కె.వరుణ్ తేజ 590 మార్కులు సాధించగా, ఎస్.షబ్నమ్ (587), జె.ప్రవిత్ర, ఎస్.రిహాన్ (584), పి.మోహిత్‌రెడ్డి (582) మార్కులు సాధించారు. 550 కంటే ఎక్కువగా 29 మంది, 500 కంటే అధికంగా 56 మంది మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విజయం యాజమాన్యం, హెచ్‌ఎం శ్రీదేవి అభినందించారు. ● స్థానిక 75దొడ్డిపల్లి ప్రకాశం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎస్.మోనిక (587), వైష్ణవి (586), ఎం.కే.సిరి, హస్రఫ్ అలీ (578), చారులత, మోహిత్ సాయి (577) మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ టీఎస్ సందీప్ తెలిపారు. 500లకు పైగా 30 మంది విద్యార్థులు సాధించారు. వీరిని హెచ్‌ఎం సిరాజ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు. ● స్థానిక గిరింపేటలోని నారాయణ స్కూల్లో ఎస్.మోహిత్ (596) మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవగా, ఎస్.లీలశ్రీ, బి.సాయిచరణ్‌లు (595) మార్కులు సాధించినట్లు ఏజీఎం రవీంద్ర ఫణికుమార్, ప్రిన్సిపాల్ వేదవతి తెలిపారు. వీరిని యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ● స్థానిక విజ్ఞానదీప్తిలో హర్షిత రెడ్డి, ఊహశ్రీ (590), భరత్‌రెడ్డి (587), వినీత్‌రెడ్డి (583), దివ్య చంద్రిక, పద్మశ్రీలు (578) మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ నరేష్ చంద్రారెడ్డి, ప్రకాష్‌చంద్రారెడ్డిలు తెలిపారు. స్థానిక కేశవరెడ్డి పాఠశాలలో రేష్మశ్రీ (594) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ముబీద్ తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధే సహకారసంఘాల లక్ష్యం

● డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగానికి అవసరమైన రుణాలను రైతులకు అందజేసి తద్వారా వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ సీఈవో శంకర్ బాబు అన్నారు. బుధవారం గంగాధరనెల్లూరు సింగిల్‌విండో ఆఫీస్ ఆవరణలో సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మంగపట్నం మహేష్, వ్యవసాయాధికారి భవాని, సింగిల్ విండో సీఈవో విజయకుమార్‌రెడ్డి, బ్యాంక్ సూపర్‌వైజర్ మాబుని బేగం, ఇన్‌చార్జి వీఆర్వో లోకనాథం, స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.